క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

టెక్కలి: కోటబొమ్మాళి మండలం సీతన్నపేట గ్రామానికి చెందిన ఇప్పిలి త్రినాథ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు జి.గురునాథ్ యాదవ్ తన కార్యాలయంలో గురువారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇంతకుముందు గురునాథ్ యాదవ్ బృందం రూ.30 వేల సాయం అందించారు. ఆయనతో పాటు ఎస్.నరేష్, పి.రవి ఉన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

కంచిలి: గ్రామాల్లో నేర సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు కృషి చేయాలని సోంపేట సీఐ బి.మంగరాజు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ పి.పారినాయుడు అధ్యక్షతన సచివాలయాల మహిళా పోలీసులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విధుల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నేర సమాచారంపై సమీక్ష నిర్వహించారు.

శిష్టు గోపికి సన్మానం



గోపిని సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన శిష్టు గోపిని ఆ పార్టీ యువత గురువారం సూదికొండలో సన్మానించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొత్తపల్లి వాసు, బోనెల గణపతి, లండ పాపారావు, నెయ్యిల శివకుమార్, నందిగాం ప్రసాద్, తోట సోమేష్, కొవ్వూరు రాజేష్, కురుమోజు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అభ్యాసన సామర్థ్యాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని మండల విద్యాశాఖాధికారులు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథంలు అన్నారు. మండలంలోని అయ్యవారిపేట, జగన్నాథపురం, తిప్పనపుట్టుగ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు సృజనాత్మకమైన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలల రికార్డులను పరిశీలించారు.

హిందూ ధర్మం దిక్సూచి వంటిది

ఇచ్ఛాపురం: హిందూ ధర్మం మానవ మనుగడకు దిక్సూచి వంటిదని హిందూ ధార్మిక సేవ సంస్థ, నైమిశారణ్య పీఠం వ్యవస్థాపకుడు బాలబ్రహ్మానంద సరస్వతీ అన్నారు. పట్టణంలోని పాతాళ సిద్ధేశ్వరాలయం వద్ద హిందూ ధార్మిక మహాసభ, విజయ వారాహి యజ్ఞం కార్యక్రమాన్ని స్థానిక హిందూ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలువురు స్వామీజీలు పాల్గొన్నారు.

గోకార్టింగ్ చాంపియన్లుగా ఆదిత్య విద్యార్థులు

టెక్కలి: భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహించిన గోకార్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి మొదటి స్థానంలో నిలిచారని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 11 బృందాలు హాజరు కాగా, ఐతమ్ గోకార్టింగ్ స్పార్టన్స్ బృందం కాస్ట్ ప్లాన్ ప్రజంటేషన్ అనే అంశంలో మొదటి బహుమతి సాధించిందని వెల్లడించారు. ఈ సందర్భంగా గోకార్టింగ్ మెంటార్లు డి.రఘువీర్, ఎం.వంశీనారాయణ, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐఐసీ కన్వీనర్ జి.సతీష్‌కుమార్, పి.శ్రీహరి, వై.రమేష్, ఎంవీవీ.చంద్రశేఖర్, పి.రమేష్‌నాయుడు తదితరులు విద్యార్థులను అభినందించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ సూచించారు. మండపల్లి ఉన్నత పాఠశాలలో 'సంకల్పం' అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఒత్తిడికి గురవ్వకుండా ప్రణాళికతో చదివితే విజయం వరిస్తుందని పేర్కొన్నారు. సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు.

అన్నదాత ఆందోళన..!



- కలిసిరాని ఖరీఫ్ సీజన్
- అందని పంటనష్ట పరిహారం
- అమలుకాని అన్నదాత సుఖీభవ

సోంపేట:

ఆరుగాలం కష్టపడి వరి సాగు చేసిన ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని రైతులకు ఖరీఫ్ సీజన్ నష్టాలను మిగిల్చింది. గతేడాది డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాలకు చేతికందిన పంట నీటిపాలయ్యింది. కొన్నిచోట్ల ధాన్యం మొలకలు రాగా, మరికొన్ని ప్రాంతాల్లో పంటకోసే పరిస్థితి లేకుండా పాడైపోయింది. పడిపోయిన వరి పంటను మిషన్ల తో కోయిస్తే వరికోసే యంత్రం అద్దె కూడా రాలేద ని రైతులు వాపోతున్నారు. నాలుగు మండలాల్లో సుమారు 30వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు.



మొలకలు వచ్చిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి (ఫైల్)

నమోదు చేసిన పంటనష్టం వివరాలు

మండలం	రైతులు	హెక్టార్లు	అందించాల్సిన పరిహారం (రూ.లక్షల్లో)
సోంపేట	56	12.13	2.06
ఇచ్ఛాపురం	280	80.79	13.73
కవిటి	239	44.09	7.06
కంచిలి	221	49.88	8.48

పంటనష్టం నమోదులో కొర్రీలు

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. పంట నష్ట పరిహారం కోసం రైతుల పేర్లు నమోదు చేసే క్రమంలో కొర్రీలు విధించింది. నేలకు ఒరిగి, నీటిలో మునిగిన పంట ఉన్న రైతుల పేర్లు మాత్రమే వ్యవసాయ సిబ్బంది నమో దు చేశారు. దీంతో వేలాది మంది రైతులకు పంట నష్టం వాటిల్లినా, పరిహారం కోసం పేర్లు నమోదు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. నిజానికి వేలల్లో రైతులు పంట నష్టపోయినా, వందల్లో రైతుల పేర్లు మాత్రమే పంట నష్ట పరిహారం కోసం నమోదయ్యాయి.

నష్ట పరిహారం ఎన్నడో

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 796 మంది రైతులకు పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అయితే రబీ సీజన్ ప్రారంభం కావడంతో పంటనష్ట పరిహారం అందితే పెట్టుబడికి సహాయ పడుతుందని రైతులు ఆశపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం వెంటనే అందజేయాలని కోరుతున్నారు.

ఊసేలేని అన్నదాత సుఖీభవ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇంకా అన్నదాత సుఖీభవ ఊసేలేదని రైతులు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో రైతు భరోసా కింద ప్రతీ సీజన్‌లో ఆర్థిక సాయం అందజేసేవారని, రైతుల పెట్టుబడికి ఉపయోగపడేదని గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ అందజేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పంటసాగు చేసేందుకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు నిధులు విడుదల చేయాలి.

– తడక జోగారావు, సర్పంచ్, పలాసపురం

పరిహారం అందజేయాలి



ఖరీఫ్ సీజన్‌లో డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షాలకు నేను సాగు చేసిన రెండు ఎకరాల వరి పంటకు తీవ్ర నష్టం కలిగింది. అధికారులు పంట నష్ట పరిహారం కింద పేరు నమోదు చేశారు. ప్రభుత్వం, వ్యవసాయాధికారులు స్పందించి నష్ట పరిహారం త్వరితగతిన అందజేయాలి.

– మద్దు బుచ్చిబాబు, రైతు, బెంకిలి

బీమా వర్తింపజేయాలి



ఖరీఫ్ సీజన్‌లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సాగు చేసిన వరిపంట అకాల వర్షాలు వలన బాగా దెబ్బ తింది. పంట పాడవ్వడంతో రైతులు పంటల రుణాలు తిరిగి చెల్లించే పరిస్థితిలో లేరు. ప్రభుత్వం స్పందించి ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులందరికీ పంటల బీమా వర్తింపజేయాలి.

– పోకల హేమరాజు, రైతు, జింకిభద్ర

వివరాలు అందజేశాం



నాలుగు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరిపంట పాడైపోయిన రైతుల వివరాలు నమోదు చేశాం. వివరాలను ఉన్నత అధికారులు, ప్రభుత్వానికి అందజేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది.

– కె.జగన్మోహనరావు, ఏడీఏ, సోంపేట

దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపునకు 210 దరఖాస్తులు



విభిన్న ప్రతిభావంతులకు సహకరిస్తున్న పలాస విద్యార్థులు

పలాస: పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరంలో 210 దరఖాస్తులను స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతులతో పాటు వారికి సహాయకులుగా మొత్తం 500 మంది హాజరయ్యారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వారి సి.ఎస్.ఆర్. ఫండ్స్ సహకారంతో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ సంస్థ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలాస రెవిన్యూ డివిజన్‌లోని మొత్తం 8 మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారు. బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్, మూడు చక్రాల సైకిల్, రెండు చక్రాల తోపుడు కుర్చీ, కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు తదితర వాటి కోసం విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తులు చేసుకున్నారు. భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(కాన్పూర్) సౌజన్యంతో త్వరలోనే ఈ పరికరాలు అందజేస్తామని ఏడీ కవిత తెలిపారు. కాగా, విభిన్న ప్రతిభావంతులకు సహాయం చేసేందుకు పలాస ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు వలంటీర్లుగా వచ్చి సహకారం అందజేశారు. కార్యక్రమంలో పలాస ఎంపీడీఓ కె.వసంతకుమార్, వజ్రపుకొత్తూరు ఎంపీడీఓ ఎన్.రమేష్‌నాయుడు, పలాస పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

రథ సప్తమి భక్తులకు సూచనలు

కంచిలి: జిల్లా కేంద్రంలోని అరసవల్లిలో సూర్యనారాయణ స్వామివారి దేవాలయానికి రథసప్తమి సందర్భంగా వెళ్లే భక్తులకు సోంపేట సీఐ బి.మంగరాజు పలు సూచనలు చేశారు. ఇచ్ఛాపురం, సోంపేట పరిసర ప్రాంతాల నుంచి అరసవల్లి వెళ్లే ఆటో, ట్యాక్సీ, క్యాబ్, స్పెషల్ బస్సుల ఆపరేటర్లు శ్రీకాకుళం ముందు అంపోలు జైలు రోడ్డు దాటిన తర్వాత, రూరల్ పోలీస్ స్టేషన్‌కు ముందు వరుణ్ మారుతి షోరూమ్ ఎదురుగా ఉండే రోడ్డు నుంచి శాస్త్రులపేట, సానివాడ గ్రామాల మీదుగా ఒప్పంగి చేరుకొని, అక్కడి నుంచి వాడాడ జంక్షన్ మీదుగా అరసవల్లి పుష్కరిణి సమీపానికి చేరుకోవాల్సిందిగా సూచించారు. శ్రీకాకుళం పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, శీఘ్రంగా దేవాలయానికి అతిచేరువగా ఈ మార్గం ఉందని సూచించారు. వాహనాల్లో వెళ్లే భక్తుల వాహనాల డ్రైవర్లు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

నిష్పక్షపాతంగా పనులు చేపట్టాలి

కంచిలి: గ్రామాల్లో నిష్పక్షపాతంగా ఉపాధి పనులు చేపట్టాలని, వేతనదారులకు ఒకరోజుకు రూ.300 గౌరవ వేతనం అందేటట్లు ప్రోత్సహించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు క్షేత్ర సహాయకులకు సూచించారు. మండలంలో పోలేరు గ్రామంలోని బొడ్డ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. అనంతరం పోలేరుతో పాటు డీజీపురం, మఠం సరియాపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించి అక్కడ సిబ్బంది పనితీరును పరిశీలించారు. అలాగే డీజీపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

టెక్కలి: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ఆనుకొని ఉన్నటువంటి పంచాయతీ స్థలంలో అక్రమ కట్టడాలను గురువారం అధికారులు కూల్చివేశారు. ఇదే స్థలంలో కొంతమంది తాత్కాలిక కట్టడాలతో పాటు శాశ్వత కట్టడాల నిర్మాణం చేశారు. దీనిపై స్థానికంగా కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయా కట్టడాలను కూల్చివేశారు.

డొంకూరు సందర్శన

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు మత్స్యకార గ్రామ సమస్యలపై స్థానిక మత్స్యకార ప్రతినిధి చీకటి కృష్ణయ్య ఇటీవల మంగళగిరిలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కు ఇచ్చిన వినతిపత్రం మేరకు గురువారం జిల్లా మత్స్యశాఖాధికారులు గ్రామంలో పర్యటించారు. ఉన్నతాధికారులకు సమస్యలను తెలియజేయడం జరుగుతుందన్నారు.

బీమా సద్వినియోగం చేసుకోండి

కంచిలి: ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కొబ్బరి చెట్లకు వయస్సు ఆధారంగా కల్పిస్తున్న బీమాను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన విస్తరణాధికారి బాలరాజు కోరారు. మకరాంపురం, పెద్ద శ్రీరాంపురం గ్రామ రైతుసేవా కేంద్రాల్లో గురువారం సమావేశాలు నిర్వహించారు.

వాయిదాపడిన బడ్జెట్ సమావేశం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం గురువారం వాయిదా పడింది. ఉదయం పదకొండు గంటలకు మున్సిపల్ సర్వసభ్య సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మున్సిపల్ బడ్జెట్‌పై ఎటువంటి చర్చలు జరగకూడదనే నిబంధన రీత్యా ఈ సమావేశం వాయిదా వేస్తున్నామని ప్రకటించారు.

తరగతుల విలీనాన్ని ఆపాలి



ఎంఈవో శివరాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి పంచాయతీ పరిధి నారాయణబట్టి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులను పక్క పంచాయతీ బెల్లుపడ ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేసే ఆలోచనను అధికారులు విరమించుకోవాలని గ్రామస్తులు కోరారు. స్థానిక సర్పంచ్ కొణపల సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్‌ను మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం కలిశారు. చాలా ఏళ్లుగా తమ గ్రామంలో నడుస్తున్న పాఠశాలలో కొన్ని తరగతులను తొలగించి, పక్క పాఠశాలలో కలిపితే ఇక్కడ పిల్లలు ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క గ్రామంలో సుమారు 2 కిలోమీటర్లు దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లాలంటే మార్గ మధ్యలో గెడ్డ దాటాల్సి ఉంటుందని తెలిపారు. వర్షాకాలం వస్తే ఈ గెడ్డ ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని తమ గ్రామ పాఠశాలలో ఐదు వరకు తరగతులను కొనసాగించాలని, రానున్న విద్యా సంవత్సరంలో మరిన్ని అడ్మిషన్లు పెరిగేందుకు గ్రామస్తులంతా కలిసి ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. అక్కడికి వచ్చిన స్థానిక ఎస్ఐ పి.పారినాయుడుకు కూడా పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, ఉప సర్పంచ్ బుడ్డెపు ఆనంద్, వార్డు మెంబర్ బుడ్డెపు గణేష్, టీడీపీ నేత కిషోర్ పాఢి, కిలుగు వల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మేట్లను ఎలా తొలగిస్తారు..?



ఉపాధి ఏపీవో శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ఎంపీపీ పుష్ప తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా, వేతనదారులకు సమాచారం లేకుండా మేట్లను ఎలా తొలగిస్తారని ఎంపీపీ బోర పుష్ప ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లను తొలగించి, కూటమి నేతలు తమకు అనుకూలమైన వ్యక్తులను నియమిస్తున్న నేపథ్యంలో, ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన ఇచ్ఛాపురం మండలం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉపాధి హామీ పథకం ఏపీవో పి.శ్రీనివాసరావును గురువారం కలిశారు. పాత మేట్లు ఇప్పటికే పని డిమాండ్ ఇవ్వడం, మస్టర్లు వేయడం వంటి వాటిపై శిక్షణ పొందారని, వారిని కాదని కొత్తవారిని ఎలా నియమిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేట్లను తొలగించాలంటే గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయం తీసుకోవాలన్నారు. దీనిపై ఏపీవో శ్రీనివాసరావు స్పందిస్తూ గ్రామ సభలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగు జాడల్లో నడవాలి



కాశీబుగ్గ: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు తదితరులు



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో మహాత్మునికి నివాళులర్పిస్తున్న బాలబాలికలు



టెక్కలి: కోటబొమ్మాళిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు



ఇచ్ఛాపురం రూరల్: భవానీపురం అంగన్‌వాడీలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ గాంధీజీ అడుగు జాడల్లో నడవాలని వక్తలు సూచించారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు

పలాస: ప్రజలకు ఇబ్బంది లేకుండా లీకవుతున్న పైపులైన్లు, సీసీ రోడ్ల పనులు చేపడతామని పంచాయతీ రాజ్ డీఈ రవిబాబు చెప్పారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామంలో గురువారం కూటమి నాయకులతో కలిసి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, కూటమి నాయకులు వడ్డి యాదగిరి, ఆళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

పలాసలో సత్సంగం

కాశీబుగ్గ: పలాస పట్టణంలోని సత్యసాయి మందిరంలో గురువారం ఆధ్యాత్మిక సత్సంగం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వపు వీసీ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ.. భగవంతుడే మానవ రూపం ధరించి సత్యసాయిబాబా రూపంలో ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని తీసుకొచ్చాడన్నారు. సత్యసాయి బోధనలు మానవాళి ఉన్నతికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సత్యసాయి బాబా మందిరం కార్యవర్గ సభ్యులు కె.జగ్గప్ప, రాజు, గొర్లె నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

టెక్కలి: రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు వంటి సందర్భాల్లో ప్రాణాలు కాపాడేందుకు ఎంతగానో ఉపయోగపడే సీపీఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ జిల్లా ప్రోగాం మేనేజర్ జి.రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలలో సీపీఆర్ విధానంపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.